క్లుప్తంగా

ఆలయానికి శఠగోపం వితరణ



పెబ్బేరు: మండలంలో రంగాపూర్ ఆలయంలో కొలువైన శ్రీ చింతల వేంకటేశ్వరస్వామికి శుక్రవారం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అర కిలో వెండి శఠగోపం చేయించి స్వామివారికి బహూకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, వాసుదేవారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, రమేష్‌రెడ్డి, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రజావైద్యశాలలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ శారద, మురళీధర్ తెలిపారు. ఆస్పత్రి ప్రారంభించి 35ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్పత్రిలో శుక్రవారం పేదలకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని కర్నూల్‌కు చెందిన డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు శంకర్ ప్రసాద్, సీపీఎం నాయకులు విజయరాములు, సతీష్‌యాదవ్, వైద్యులు ప్రత్యూష, సిద్ధార్థ, హరికృష్ణ, రమేష్‌బాబు, జిల్లెల ప్రవీణ్, విశ్వేశ్వర్‌రెడ్డి తదిరులు ఉన్నారు.

చోరీపై వివరాల సేకరణ



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సీతారామాలయంలోని దేవత మెడలో ఉన్న పుస్తెలతాడు ఎత్తుకెళ్లడంపై పోలీసులు శుక్రవారం విచారణ చేపట్టారు. అమ్మవారి మెడలోని పుస్తెలను తీసుకెళ్లిన విషయం గ్రామస్తులు శుక్రవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వనపర్తి క్లూస్ టీంలను రప్పించి వేలు ముద్రలు సేకరించారు. చోరీ విషయమై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతామని ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు.

ఎంపీపీ దంపతులకు సన్మానం



మదనాపురం: పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట్‌నారాయణ, ఎంపీపీ పద్మావతి దంపతులను మార్కెట్ యార్డులో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, హనుమాన్‌రావు, వడ్డె రాముడు, నాగన్నయాదవ్, మహాదేవన్‌గౌడ్, అచ్యుతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, బాలు, సత్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం శివారులో పంటలు సాగు చేసిన రైతులతో శుక్రవారం ఏఓ అనిల్‌కుమార్ మాట్లాడారు. రైతులు చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటలో ప్రస్తుతం తెగుళ్లు కనిపిస్తున్నాయని, వాటి నివారణ కోసం రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

అమరచింత: మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీ నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన నర్సరీలో 34 వేల మొక్కలను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేశామన్నారు. వివిధ రకాలైన పండ్ల, పూల మొక్కలను తెప్పించి వాటిని నర్సరీలో భద్రపరిచామని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో గ్రీన్ నెట్ లను ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకొని, క్రమం తప్పకుండా నీటిని అందిస్తున్నామని వెల్లడించారు.

కేంద్రంపై పోరు తప్పదు

కొత్తకోట: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వంట గ్యాస్ ధరలను పెంచినందుకు నిరసనగా శుక్రవారం కొత్తకోటలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో చర్చించకుండా ప్రజలపై భారం మోపుతూ నిరంకుశ పాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని, ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, ఆకుల శ్రీను, గాడీల ప్రశాంత్, యాదగిరి, జగన్మోహన్‌రెడ్డి, కటికె శ్రీనివాస్‌జీ, మిషేక్, సత్యంయాదవ్ తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నంబావి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదన్నయాదవ్, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, పల్లె మద్దిలేటి, చిన్నారెడ్డి, రామస్వామి, తగరం లక్ష్మి, డేగ శేఖర్, జీవీకే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు సత్వరమే తగ్గించాలని కోరుతూ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మదనాపురం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, రవీందర్‌రెడ్డి, హనుమాన్‌రావు సర్పంచ్‌లు రాంనారాయణ, శ్రావణి, టీకే శారద పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుభాష్ చౌరస్తా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సర్పంచ్ రామేశ్వర్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: కేంద్ర ప్రభుత్వం పేదలపై పెనుభారం మోపడం ఇకనైనా మానుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంపై రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు గోపాల్‌పేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు సిలిండర్లతో బస్టాండులో ధర్నా నిర్వహించారు.



వీపనగండ్లలో..



చిన్నంబావిలో..



పెబ్బేరులో..

ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు



చిక్కేపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



నాగరాలలో..

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. వీరిలో డీఈఓగా భవాని, డిప్యూటీ డీఈఓగా సుజిత, ఎంఈఓగా వినయ్, హెచ్‌ఎంగా దుర్గేశ్వరి తో పాటు 23 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామియాదవ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, వారే విద్యార్థులకు మార్గదర్శకులని సర్పంచు ఆంజనేయులు అన్నారు. శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కలెక్టర్‌గా విజయకుమార్, డిప్యూటీ కలెక్టర్‌గా పవన్ కళ్యాన్, డీఈఓగా రాంచరణ్, హెచ్‌ఎంగా శైలజ ఒక్కరోజు విధులు నిర్వహించారు. వీరిలో చక్కని ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ నరసింహ, ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, వెంకటేష్, రాధ, వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చూపే కోర్సులను ఎంచుకోండి

పాన్‌గల్: పదో తరగతి తర్వాత ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకుంటే త్వరగా ఉద్యోగంలో నిలదొక్కుకునే అవకాశం లభిస్తుందని పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం మంజుల అన్నారు. శుక్రవారం గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో పదో తరగతి బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న ఒకేషనల్ కోర్సులు, అగ్రికల్చర్, టెక్నికల్, ఐటీఐ ఎంపీహెచ్‌డబ్ల్యూ వంటి కోర్సులు తీసుకోని విద్యను పూర్తి చేస్తే జీవితంలో త్వరగా స్థిరపడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీకే మండల కోఆర్డినేటర్ లలిత, పార్వతి, ప్రవీణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

రాజావళి దర్గా ఉర్సు వాల్‌పోస్టర్ విడుదల

అమరచింత: పట్టణ కేంద్రంలో వెలసిన సయ్యద్ షా రాజావళి దర్గా షరీఫ్ ఉర్సు ఈనెల 10 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు మైను, రఫిక్, ఫరీద్ తెలిపారు. శుక్రవారం పవిత్ర నమాజు అనంతరం దర్గా ఆవరణలో ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్సుకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆలిండియా కృష్ణ, మహేష్ బాబు అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరితో పాటు ప్రముఖ సినీ ఆర్టిస్టులు హాజరవుతారని తెలిపారు. 10న గంధోత్సవం, 11న తాజే చిరాక్, 12న ఖత్మేఖూరాన్‌లతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ సహరా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు హాస్టల్‌లో మొత్తం 70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 13 మంది విద్యార్థులు జలుబు, దగ్గు, చర్మవ్యాధులతో బాధపడుతుండటంతో పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించామన్నారు. కార్యక్రమంలో వార్డెన్ సత్యనారాయణ, వైద్యసిబ్బంది నర్సింహులు, ఏఎన్‌ఎం సుమలత, ఆశాకార్యకర్త తిర్పతమ్మ, హాస్టల్ ప్రత్యేక అధికారి అర్జున్, సిబ్బంది నాగలక్ష్మి, దాహుద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెబ్బేరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అంకిత భావంతో పనిచేసే ఎమ్మెల్సీ అభ్యర్థి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని పలు పాఠశాలలు తిరిగి ఎమ్మెల్సీ ఎన్నికల కాటపల్లి జనార్దన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు.

పరిసరాల శుభ్రతే ముఖ్యం

ఆత్మకూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సర్పంచ్ సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటిపల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయాశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది 11 టీంలుగా ఏర్పడి ఒక్కో టీం 20 కుటుంబాలకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మ్యాప్ ఏర్పాటుచేసి గ్రామంలో తడి, పొడిచెత్త, ఆరోగ్యం, ఇతర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సుచిత్ర, ట్రెయినింగ్ కోఆర్డినేటర్లు రాజు, కుర్మయ్య, రఘు ఉన్నారు.

పది పరీక్షల్లో సత్తా చాటాలి

ఆత్మకూర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, కేశవాచారి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని కాలేజీ హైస్కూల్లో పిన్నంచర్ల, జూరాల, ఆత్మకూర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు

పెబ్బేరు: మండలంధిలో బునాదిపూర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగాపూర్‌కు చెందిన బొగ్గు దామోదర్ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా సూగూర్‌కు తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున గస్తీ నిర్వహిస్తున్న బీట్ పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని విచారించగా ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొత్తకోట: ప్రీతి ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు కొత్తకోటలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు వారికి దగ్గరి సంబంధం ఉన్న వ్యక్తులే ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అమ్మాయిల ఆత్మహత్యకు కారణమవుతున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బాలమణెమ్మ, శ్రీకాంత్‌రెడ్డి,భ రత్నభూషణ్, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, మన్యంయాదవ్, నర్సింహ ఉన్నారు.

వంట గ్యాస్ ధర తగ్గించే వరకు పోరాటం



అమరచింతలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో పాడెకు సిలిండర్ కట్టి నిరసన చేపట్టారు. రేమద్దులలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ పాల్గొన్నారు.

అమరచింత: నిత్యావసర సరుకుల ధరలతో పాటు వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను చీటికి మాటికి పెంచడమే కేంద్ర ప్రభుత్వ నైజంగా మారిందని సీపీఎం జిల్లా నాయకులు వెంకటేష్, అజయ్ ధ్వజమెత్తారు. వంటగ్యాస్ ధరల పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై ఖాళీ సిలిండర్‌తో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కరుణాకర్, తిరుమల శ్రీను, సూరి, మన్సూర్, విష్ణు, రాము, కార్తిక్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌కు అనుకూలంగా తీర్పు

కొత్తకోట: మండలంలోని అమడబాకుల సర్పంచ్ బుచ్చన్న ఉప సర్పంచ్ చిన్నమ్మపై అప్పటి కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాకు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేశారు. తనను అకారణంగా తొలగించారంటూ ఉప సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయ పోరాటం అనంతరం ఉప సర్పంచ్ పదవిని చిన్నమ్మ మళ్లీ దక్కించుకుంది.



కోర్టు తీర్పు ప్రతిని చూపుతున్న చిన్నమ్మ

ప్రైవేటుకు దీటుగా చదువులో రాణించాలి



విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు తోడ్పాటునిస్తూ విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించడంతోపాటు ప్రముఖ విద్యా నిపుణులచే స్టడీ మెటీరీయల్‌ను అందించినట్లు వివరించారు. నియోజకవర్గంలోని మండలాల్లో 15 వేల మంది విద్యార్థులకు రూ.10.50 లక్షల వ్యయంతో ప్యాడ్‌లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశ్వర్‌రావు, లెక్చరర్లు భాగ్యవర్ధన్ రెడ్డి, టీజే విశ్వేశ్వర్, జమున, శ్వేత, సునీల్‌రెడ్డి, విజయలక్ష్మి, కురుమూర్తి, కురుమూర్తి, రాఘవేంద్ర, పావని, వీబీగౌడ్, బుచ్చయ్య ఉన్నారు.

సీసీ రహదారి నిర్మాణాల్లో నాణ్యత లోపించొద్దు



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని ఐదు, పదో వార్డులో జరుగుతున్న సీసీ రహదారుల పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా వార్డుల్లో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలకు ఎంత మేరకు ఖర్చు అవుతుందో అన్న విషయాలను కౌన్సిలర్లు, ఏఈతో చర్చించి సరైన అంచనా వేసినట్లు తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులకు సుమారు రూ.4.10 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. వచ్చిన నిధులతో పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మున్సిపల్ పాలక వర్గం పనిచేస్తుందన్నారు.

కరాటే టోర్నమెంట్ కరపత్రం విడుదల

వనపర్తి టౌన్: రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్ కరపత్రాన్ని శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విడుదల చేశారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే చంద్రశేఖర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌లో వివిధ జిల్లాల నుంచి 1,200మంది పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు విజయ్‌కుమార్ తెలిపారు.



బ్లాక్ బెల్ట్ అందుకుంటున్న గుర్రం జోషిక

విద్యార్థి ప్రతిభ

పెబ్బేరు: హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని విక్టరీ షోటకాన్ కరాటే బెల్‌టెస్ట్ పోటీల్లో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థిని గుర్రం జోషిక ప్రతిభ కనబర్చినట్లు శుక్రవారం మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా హీరో సుమన్ చేతుల మీదుగా గుర్రం జోషిక బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్ అందుకుందని పేర్కొన్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు.

మోసపూరిత విధానాలను ఎండగట్టాలి



కొర్లకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న చింతలపల్లి జగదీశ్వర్‌రావు

వీపనగండ్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసపూరిత విధానాలతో పబ్బం గడుపుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా కొర్లకుంట, బొల్లారం గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ అమలు చేయనున్న పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతులు, నిరుద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు కేసీఆర్ మాటలు నమ్మి అధికారాన్ని కట్టబెడితే.. తన అనుచరులకు రూ.వందల కోట్ల భూములను అప్పగిస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే మారు రూ.2 లక్షల రైతు రుణాలను మాఫీ చేస్తామని, ఒకే కుటుంబంలో ఇద్దరికీ పింఛన్లు, ఖాళీ స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తామన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, రైతులకు ఏడాదికి రైతు పెట్టుబడి సాయాన్ని అందజేస్తామని ఆయన అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాముయాదవ్, మాజీ సర్పంచ్ పందెం విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతునాయక్, రాజశేఖర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి



అమరచింతలో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ సమాఖ్య సభ్యులు

అమరచింత: వీధి కుక్కలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ పిల్లలను కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లోని తిను బండారాలను వీధిలో ఎక్కడ పడితే అక్కడ విసిరి వేయడంతో కుక్కల సమూహం చేరుకునే అవకాశం ఉందన్నారు. మటన్ మార్కెట్‌లో సైతం వ్యర్థాలను డబ్బాలో ఉంచి మున్సిపల్ చెత్త సేకరణ ట్రాక్టర్ వచ్చినప్పుడు వాటిని వేయాలని ఆదేశించారు. చిన్న పిల్లలను వీధిలో ఒంటరిగా ఆడుకోనివ్వరాదని సూచించారు. కుక్కలకు ఆహారం దొరకనప్పుడు అవి పట్టణానికి దూరంగా వెళ్లిపోతాయన్నారు. కుక్కల నివారణలో ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, ఆర్పీలు సంగీత, రాజేశ్వరి, ఖాజా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.